# రాధతో

# ఎగ్జిబిషనుకు

రచన :

## బోయి భీమన్న

సుఖేలా ప్రచురణ
హైదరాబాదు

రెండవ ముద్రణ : 1979
ప్రతులు: 1000

హక్కులు రచయితవి
వెల: రూపాయి

ప్రతులకు
సుఖేలా నికేతన్,
ఐ.సి. 85, ఇరంమంజిల్ కాలనీ,
హైదరాబాదు - 500 004
ప్రగతి హైదరాబాదు - 4

# ప్రవేశిక

(మొదటి ముద్రణ, 1970)

"విశ్వ కళా ప్రదర్శనంలో
స్త్రీల ప్రత్యేక దినంలా ఉంది నభం"

చీకటి రాత్రులలో నభో మండలం ప్రదర్శించే దివ్య సౌందర్య హేలను వర్ణిస్తూ నేను "అనాది కొస నుంచి అనంతత్వంలోకి" అనే గద్యకావ్యంలో వ్రాసిన ఈ పంక్తుల్ని మిత్రులు శ్రీ నిడదవోలు సుందరేశ్వర రావుగారు తరచు కోట్‌చేస్తూ ఉంటారు. ఆయన నా ముఖం మీద వాటిని కోట్ చేసినప్పుడెల్లా, నా ముఖం కోటికోటీశ్వరశిరోభూషణ ప్రభలతో వెలిగిపోతూ ఉంటుంది.

కవిని కదా! ముఖస్తుతికి ఆ మాత్రం వికసిత ముఖారవిందుణ్ణి కాకుండా ఎలా ఉండగలను? పైగా – ఆయన అలా కోట్ చేసి – "ఎవరండీ ఈ మాత్రం కవిత చెప్పగలుగు తున్న వారు ఈ రోజుల్లో?" అని ప్రశ్నించినప్పుడు – ఓహో, ఇంకేముంది పారవశ్య దివ్యాశ్వాన్ని అధిరోహించి, ఏడేడు పధ్నాలుగు లోకాల సమస్త కళా ప్రదర్శనల్నీ, అందాల ఎగ్జిబిషన్లనీ క్షణంలో చూచి వచ్చేస్తాను భూమి మీదికి.

అలా భూమి మీదికి రాగానే, నాకు అన్నింటికంటే ఆనందాతిరేకాన్ని కలిగించేది – అనుభూతికి అంది, ఆలింగనంలోని ఆత్మేశ్వరిలా, అన్ని రుచులూ తానే అయి, అమృతమే తానై ఆస్వాదింపజేసేది–ప్రతి సంవత్సరమూ హైదరాబాదులో జరిగే ఇండస్ట్రియల్ ఎగ్జిబిషను!

ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అంటే!

మిరపకాయ బజ్జీలు చెయ్యడం దగ్గర నుంచి, శుక్రగ్రహ యాత్రకు రాకెట్లు తయారుచెయ్యడం వరకూ – అన్నీ ఇండస్ట్రీలే. అవన్నీ పరిశ్రమలే. అన్నిటికీ ఆయా రంగాలలో సంపూర్ణ విజ్ఞానమూ, సమగ్ర నైపుణ్యమూ, సనిష్ఠా నిర్వహణమూ అవసరమే. ఈ మూడు తపఃక్రియలతో కూడినదే ఈ ఎగ్జిబిషను!

లక్ష మంది రంభోర్వశుల కంటె ఒక్క ప్రియురాలు శ్రేష్ఠం. లక్ష మంది ప్రియురాండ్ర కంటె ఒక్క లక్షణమైన భార్య శ్రేష్ఠం. లక్ష మంది భార్యలకంటె ఒక్క లక్ష్యం కోసం త్యాగం శ్రేష్ఠం. లక్ష త్యాగాల కంటె ఒక్క ఆత్మానంద పారవశ్యం శ్రేష్ఠం.

ఈ విధమైన ఆలోచనలతో నేను ఒంటరిగాను, జంటగాను, హితమితంగాను, స్నేహ బాహుళ్యంగాను, ఏ విధమైన భావాలతో తిరిగినప్పటికీ ఎగ్జిబిషన్‌లో మైమరచి తిరుగు తున్నప్పుడెల్లా – ఎగ్జిబిషనే విశ్వసమస్తమూగా భావిస్తాను. కనుక ఈ సమస్తానికీ నేనే పరమేశ్వరుణ్ని అనుకొంటూ వుంటాను సబ్జెక్టివు (Subjective)గా!

అలా అనుకొంటూ వ్రాసిందే ఈ కవిత.

ప్రతి ఏడాదీ ఎగ్జిబిషను సమయంలో, ఎగ్జిబిషను సొసైటీ వారు – తమ కార్యక్రమ పరంపరలలో – తెలుగు కవి సమ్మేళనం కూడ ఏర్పాటు చెయ్యడం లోగడ పరిపాటి అయింది. ఆ విధంగా అక్కడ తెలుగు సరస్వతికి ప్రతిష్ఠ జరిగింది. అట్టి కవితా సమారోహాలలో ఒకదానికి నేను (1969లో) అధ్యక్షత వహించే భాగ్యం కలిగింది. అప్పుడు నేను గానం చేసిందే ఈ ''రాధతో ఎగ్జిబిషనుకు'' కవిత. దీనిని కుందుర్తి మెచ్చుకొని గోపాలచక్రవర్తికి చెప్పడం, ఆయన హుటాహుటిగా రప్పించుకొని ''ఆంధ్రప్రదేశ్'' పత్రికలో ప్రకటించడం ఆ తర్వాతి కథ.

ఇప్పుడీ కవితను పుస్తకంగా ప్రకటించి, కళాహృదయులందరికీ అంద జేస్తున్నాను. ఇందుకు ప్రోత్సాహం అందజేసిన ఎగ్జిబిషన్ సొసైటీ వారి సారస్వత హృదయానికి కృతజ్ఞత చెల్లిస్తున్నాను. ధ్వని ప్రధానమైన ఈ కవితలోని అందాలను గుర్తించి ఆస్వాదంచగల రసజ్ఞు లందరికీ అంజలి ఘటిస్తున్నాను.

ఈ కవితను ఇంకా ఎంతో పెంచవచ్చు. ప్రతి స్టాలును గురించీ ఎంతో వర్ణించవచ్చు. ఎన్నో అందాలను, విలువలను ఆవిష్కరించవచ్చు. ఆ పని తర్వాత.

(రెండవ ముద్రణ, 1979)

''రాధతో ఎగ్జిబిషనుకు'' అనే ఈ కవిత 1970 జనవరిలో వ్రాయబడి, నాటి కవి సమ్మేళనంలో గానం చెయ్యబడి, ఎగ్జిబిషను సొసైటీవారి సహాయంతో

ముద్రించబడింది. మళ్ళీ తొమ్మిదేళ్ళకు ఇప్పుడు పునర్ముద్రించబడుతున్నది - సపరిష్కృతంగా.

ఈ తొమ్మిదేళ్ళలోనూ ఈ చిన్న కవిత నా స్నేహ పరిధిలోని భావుకులు, రసజ్ఞులు అయిన యువతీ యువకులకు కలిగించిన కావ్యానందం కొలత కందనిదే.

మనిషికి కావ్యం ఇవ్వవలసింది కౌగిలిలోని కాంతవలె - ఆనందోపదేశం, ఆనందం కలిగిస్తూ అభ్యుదయం కేసి నడిపించడం.

అట్టి కావ్య గుణం, రసవత్తత ఈ చిన్న కవితలో వున్నదన్నారు సరసులు.

''ఆ కవితా ప్రతులింకా వున్నాయా?'' అన్నారు మిత్రులు జయసేనగారు మొన్న ఒక రోజున - నన్నూ, నా శ్రీమతినీ ఎగ్జిబిషనులో చూచి. మోహనరెడ్డి, చెన్నారెడ్డి, రాంరెడ్డి, రమణరావు మున్నగువారు కూడ అదే ప్రశ్న వేసి, దాన్ని పునర్ముద్రణకు ఇవ్వండీ అన్నారు. అందరూ కూడ ఎగ్జిబిషను సొసైటీ ప్రముఖులే.

ఈ కవిత కాపీలు ఏనాడో అయిపోయాయి.

నాలుగేళ్ళ క్రితం కాబోలు, సభ్యుల కోరికపై, దీన్ని ఎగ్జిబిషను కవి సమ్మేళనలో నేను చదివినప్పుడు, తిరుమల రామచంద్రగారు చమత్కారంగా అన్నారు ''ఇది కొత్త రాధా? పాత రాధా?'' అని.

ప్రతియేడూ ఒక కొత్త రాధ ఎక్కడి నుంచి వస్తుంది? పైగా నా దృష్టిలో తెలియని కొత్తకంటె తెలిసిన పాతే ఇతోధికానందకరం. ప్రపత్తికి అదే మూలం.

''ఎగ్జిబిషనులాగే ప్రతిసారీ కొత్త అందాలు సింగారించుకొనే పాత రాధ'' అన్నా నాయనకు జవాబుగా.

నవ నవోన్మేష రాగ సౌందర్యశాలిని అయిన ఈ సనాతనానంద రసధారతో ఈసారి కూడ ఈ నవకవి సమ్మేళనకు హాజరవుతున్నాను. కవి మిత్రుల, సహృదయ చంద్రుల ప్రశంసా దరహాస సుధా సమాకాంక్షినై. అనుగ్రహింతురుగాక!

భాగ్యనగర్
జనవరి, 1979

బోయి భీమన్న

# 1. అందమైన సాయంత్రం

ఎగ్జిబిషనుకు పోదామా, రాధా?
అందమైన సాయంత్రం కాగూడదు వృధా!

ఉదయం కంటె సాయంత్రం అందమైంది,
ఉదయం క్రాంతి పథం
సాయంత్రం విశ్రాంతి విమానం.
ఉదయం నుంచీ పనిచేసి అలసిన జీవికి
సుభగ సుందర సాయంత్రమే పరమైశ్వర్యం!

అందుకే అలంకరించుకోవాలి
అందంగా సాయంసమయాన్ని–
పారోద్యానాల విహారాలతో
సంధ్యారాగ అంగరాగాలతో
సాహితీ సదస్సులతో
సంస్కృతీ విన్యాసాలతో.
పగలంతా పనిచేసిన చెమట కంపును
సాయంకాలపు పూలగాలి కెరటాలలో
కడిగేసుకోవాలి.
కర్తవ్యాల నిర్వహణలో కరిగిపోయిన
మనోదారుఢ్యాలను మళ్ళీ సంతరించుకోవాలి,
సిద్ధం కావాలి
ఆనంద చేతనా సమాలింగనం కోసం!

## 2. రవీంద్ర భారతి

అయితే-
రవీంద్ర భారతికే పోగూడదా?
సంగీత సాహిత్య సుధా పూర్ణకుంభ
కదా ఆమె, అంటావా?

ఎందుకు పోగూడదు?
ఇన్విటేషనే లేదు!

ముతాలు కడితేనే కాని
ముందుకు పోలేని ఈ రోజులలో
ప్రజాస్వామ్యపు వి.ఐ.పీ.ల లిస్టులలో
మనలాంటి పేద కళాకారుల పేర్లుండవు..

విదేశీ సాంస్కృతిక రంభలు యెత్తిపోసే
రంభోరు నైగ నిగ్యపు రుచులు
సచివాలయం సరసులకే తప్ప
కవులకూ, కళాకారులకూ ఎలా తెలుస్తై?
అందుకే ఆ ఆహ్వానాలు మనదాకా రావు!

మొన్నటి రష్యా రంగులకు పిల్చారా?
నేటి కాశ్మీరీ కంగులకు పిలుస్తారా?
అది ప్రజారాజ్య రాజ దర్బారులే,
రాజ బంధువులకే అక్కడ ప్రవేశం!

ఎగ్జిబిషనుకే పోదాం పద, రాధా!
అందమైన ఈ సాయంత్రం కాకూడదు వృధా!

## 3. పంచేంద్రియాలకూ పండగ

ఇరవై పైసలకే అరవై కోట్ల అందాలతో
పంచేంద్రియాలకూ పండుగ చేసే ఎగ్జిబిషన్!
కనిపించే, వినిపించే, తినిపించే, త్రాపించే
ఏ ఆనందానికీ లేదిక్కడ ప్రొహిబిషన్!

చీరలూ, చెప్పులూ, బొమ్మలూ, బామ్మలూ
మిరపకాయ బజ్జీలూ, పచ్చి చేప వేపుడులూ,
మినీ రైలూ, జెయింటు వీలూ, సినీ షోలూ,
రేడియో కేంద్రంలో తప్పిపోయిన పిల్లల ఏడ్పులూ,

ఇంతేకాదు నిమాయిష్-
ఇంకా ఉన్నై ఇఫ్ యూ విష్!
కాఫీ త్రాగవచ్చు – చేతైతే
కప్పులు జేబుల్లో వేసుకు పోవచ్చు,

ఏడో, మూడో పైసలకు
ఎడారి ఓడలు ఎక్కవచ్చు
రంగుల రాట్నాలపై రాసక్రీడలు నెరపవచ్చు

రగడ తినవచ్చు. చెరకురసం త్రాగవచ్చు
మాయా కుటీరాల్లో మైరేయం ఎఫెక్టు చూడవచ్చు

ముఖాల పోలికలు లేకుండా
ముప్పావులా ఫోటోలు తీసుకోవచ్చు!

చీరకొంగు పిండుకొంటున్న ఆ సింగారి చిత్రం చూడు!
కేలండరు ఉచితం, జోడు ఖరీదు మాత్రం పదిహేడు!
ముత్యపు చిప్పలో ఆ మౌక్తిక మోహిని!
కేలండరైతేనేం, కళ కుంటే ఒక బాణీ!

## 4. యావత్ భారతానికే అద్దం

కాశ్మీరీ కనకాంబర చుంబి శిరస్ ఝరీ అంచుల్లో
కన్యాకుమారీ చలచ్చరణ శంఖారవ హారాల్లో
లక్నో చికిన్ జిలుగుల్లో, రాజస్తాన్ హర్యానా
తళుకుల్లో, అస్సాం బెంగాల్ పింగాణీ హంగుల్లో
కన్నడ రమా, పంజాబీ ఉమా ఆడే
చెమ్మ చెక్క ఆటల గలగలల్లో,
గంగా, యమునా, కావేరీ కాంతలు
అలంకరించుకొన్న రక రకాల
తెలుగు చేనేత సింగారం రంగుల్లో
యావద్భారతమూ ఒక అద్దంగా-
యావద్భాషామతల్లులూ తల్లులై తీర్చి దిద్దగా
కొండవాగుల్లా, కోడె నాగుల్లా,
రాజహంసల్లా, రామ చిలుకల్లా,
అలా అలా ఆ కదిలిపోయే అమృతరూపాలు-
ఆనంద దీపాలు - చూస్తేనే చాలు!

వికసించవా కన్నుల్లో
వేయి బృందావనాలు!
తారల్ని మించిన లైట్లు, చీరల్ని మించిన సైట్లు,
ఈ రంగులూ, రుచులూ, హంగులూ, హాబీలూ
ఏ మేడలలో మోడలు దిద్దుకొన్నవో చూడు!
ప్రతి స్టాలూ ఒక మెరుపుల వీడు!
ప్రతి మెరుపూ నీ ఈడు,
ప్రతి ఈడూ మన జోడు,
ప్రతి జోడూ ఒక అర్ధనారీశ్వరుడు!

## 5. కన్యల వెంట తేళ్ళు

మిథునాల వెంట పీతలూ, సింహాలూ,
కన్యల వెంట చలితేళ్ళూ-
మోచేతులే ధనుర్బాణాలైన మానినీ మకరాలు-
బూటు కాళ్ళతో కాళ్ళు తొక్కుకుపోయే
పొగరు పొట్టేళ్ళు, అచ్చులేని ఆబోతులు-
రాశులు రాశులుగా పోతున్నారు చూడు!

రాసుకొంటూ దూసుకువస్తున్నారు చూడు!
సిగరెట్ల పొగమబ్బుల్లో, పరిహాసపు జడివానల్లో
నాజూకైన కుర్రవాళ్ళు నవ్వుకొంటూ పోతుంటే-
వాళ్ళ నీడల్లో చూశావా-
నక్కిన నల్లత్రాచుల్ని?
ఉష్ణకాంతుల క్రీనీడల్లో
బుసకొడుతున్న విష తమస్సుల్ని?

గ్రహబలం సమస్తం నీ ముందే ఉంది?
ఎవడు మనిషో, ఎవడు పామో-
చూచుకొంటూ, కాచుకొంటూ పద!

## 6. ప్రతి స్టాలూ ఒక మయసభ

అదిగో, వ్యవసాయ శాఖ వారి ప్రదర్శనం,
మన పెరటి తోటకు విత్తనాలు కొందాం.

చూశావా మన ప్రాజెక్టుల ప్రగతి?
రైల్వేల పురోగతి!
పెద్ద చిన్న గృహ కుటీర పరిశ్రమల సుగతి?

నిర్మల్ కళాఖండాలు, మైసూరు చందన సౌందర్యాలు!
ఆనంద స్వర్గాలు కావా
ఈ ప్రతిస్టాలూ ప్రదర్శించే శ్రీలు?
చోర కళాప్రపూర్ణు డెవడో
చేతి రుమాలు కొట్టాడు చూడు !

కారాగృహవాసికే కదా ఏదో దేశంలో
కవిత్వానికి బహుమతీ వచ్చింది మొన్న?

కాని పనులకు అత్తిల్లేకాదు జైలు గది-
ఎన్నో కళలకు పుట్టిల్లు కూడా అది!
శ్రీకృష్ణ జన్మ స్థానం
సమస్త సౌభాగ్యాలకూ ఆస్థానం!

ఒక్కొక్క స్టాలూ చూడాలంటే-
ఒక్కొక్క రోజు కూడా చాలదు,
రెండు వేల స్టాల్సు చూడాలంటే
రెండు వందల రోజులైనా కావద్దా?

ఏడాది పొడుగునా సాగవలసిన ఇంద్ర సభ
నలభై రోజుల మండలానికే
మయ సభగా ముగియడం ఏం న్యాయం?
అమృతం లాంటి చంద్రబింబం నుంచి
అమెరికా వాళ్లు రాళ్లు తెస్తూ ఉంటే-

పాతాళపు రాళ్ల పొరల్లో నుంచి
అమృతం తెస్తున్నారు మనవాళ్లు!
చూడు ఆ ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాలు!
పల్లె పల్లెకు పయనిస్తున్న ఆ రిగ్గులు
పాతాళ గంగాధరుడి వేడుక విగ్గులు!
లక్ష్మీ సరస్వతుల తొలి కలయిక సిగ్గులు!

# 7. ఆరు కోట్ల దేవతలు

తెలుగు వెలుగుల్లోని దేవత లంతా
కొలువుతీరి ఉన్నారిక్కడ దేవస్థానం దర్బారులో!

కైలాస శిఖరం మీది శివుని మాసిన తల నుంచి
వైకుంఠం మీదుగా, సత్యలోకం దాకా-
తిరుమల, కాళహస్తి, శ్రీశైలం, మహానంది,
అహోబిలం, ఓంకారం, లేపాక్షి, సింహాచలం,
అన్నవరం, ద్రాక్షారామం, అంతర్వేది, భద్రాచలం
బెజవాడ, యాదగిరి, వేములవాడ, అలంపురం,
రామప్ప, కాళేశ్వరం, ఓరుగల్లు-
ఎన్నెన్నో మహాక్షేత్రాలను ఆవిష్కరిస్తూ!
గోదావరి తీరంలో, వాసర క్షేత్రంలో
వెలసిన జ్ఞాన సరస్వతిని చూడు!
నమస్కరించి కుంకం తీసుకు నడు!
మన దేశంలో ఇదొక్కటే సరస్వతీ క్షేత్రం
ఈ మహాశక్తే లేకుంటేనా-
ఇక్కడ మనకు పప్పు కూడ పుట్టేదేనా?
ఇక్కడి క్యూతో సరితూగే క్యూ - ఏమిటది?
ఓహో, అది డాల్స్ (బొమ్మల) ప్రదర్శన కదూ!
భగవంతుడి రాజ్యానికి యువరాజాలు బాలలు!

చూదాం పద, ఆ పౌరాణిక చారిత్రక లీలలు!
జగన్మిథ్యగా వున్న అభ్యుదయాన్ని
ఫోటోలలో అయినా దర్శించి తరిద్దాం!
ఓహో వెంకటేశ్వర సుప్రభాతం!
చూడు ఆ చిత్రశాల శ్రీ వైభవం!
సచ్చిదానంద సుందర వైకుంఠ శోభను
రంగుల్లో పట్టిచ్చిన శ్రీధర్ కళాప్రతిభను!
వట్టి ప్రతిమలే కదా అనుకోవద్దు
ఒకో ప్రతి ఒకో గుండెకు ప్రతిరూపం!
ఒకో రసానికి ప్రతి ఫలం!
ఒకో భావానికి ఆదర్శం!
తీసుకో ఒక చిత్రం,
అది లేకుండా కాదు గృహం పవిత్రం!

# 8. రంగు రంగుల సాలెగూళ్లు

అటు చూడకు - అది మోడరన్ ఆర్ట్,
కళా రామాయణంలో అదొక పీడకల వేట!

అటు వెళ్ళకు - అది గాంధీ సాహిత్యపు స్టాలు,
స్వరాజ్య బహుపక్ష కురుక్షేత్రంలో అది అరణ్యరోదనం!
ఆ ప్రక్క బుక్‌స్టాల్స్ అన్నీ మనం ఎరిగినవేగా?
సృజనాత్మక తెలుగు సాహిత్యానికి లేదక్కడ స్థానం!
కాగా-
మన పుస్తకాలేం వుండవక్కడ!
ఎవరి పార్టీ నినాదకుల్ని వాళ్ళు
ఎవరి భజన మండలుల్ని వాళ్ళు
ఎవరి అభిమాన పాత్రధరుల్ని వాళ్ళు
కనకపు సింహాసనా లెక్కించుకునే
విపణి ఫణ మణి వీధు లవి!
మత మంత్ర తంత్రాంగాలు తెలిసిన వాళ్ళం కాం మనం
అందుకే ఆ గాలి మనకు ప్రమాదకరం!

అలా చూస్తున్నా వేమిటి?
అవి చీరలు కాదు, పాము కూసాలు!
పైసల ఈగల కోసం అల్లిన
రంగు రంగుల సాలెగూళ్లు!
కొనలేని వాళ్ల గుండెల్ని కాల్చి కరిగించే
కోరికల కన్నీళ్లు!
అవిగో అవి గోల్డు కవరింగుల పూత మెరుంగులు
వాటిని నీవు చూస్తే
అందరూ నిన్ను చూస్తారు!

## 9. ప్రగతి దర్శనం

అలా చూడు ఆ భారత దర్శనం!
అది ఒక తరం స్వతంత్ర భారతం
సాధించిన ప్రగతి ప్రదర్శనం!

జనాభాలో సగం మంది స్త్రీలు
ఎగ్జిబిషన్‌లో సగానికి సగం చీరెలు!

శాసన సభల్లో సంసారాల్లో జరగని న్యాయం
పితృ ప్రేమలో, పిత్రార్జితంలో
నిషేధించబడిన సమతా ధర్మం
వనితల కిక్కడ జరుగుతున్నది, చూడు!

అలా పద, ప్రభుత్వ ప్రదర్శన శాలల్లోకి!
అవే నిజమైన జాతి ప్రగతి దర్పణాలిక్కడ!
వాటిలో నీ ముఖాన్ని చూచుకొంటూ,
మన ఇరుగు పొరుగు శ్రీమంతుల
అమెరికా రష్యా వదనబింబాలతో పోల్చుకొంటూ,
లోపాలు సరిదిద్దుకొంటూ, పద!
లోపమేదైనా వుంటే–

అది అద్దానిదో, నీ ముఖానిదో చూపే
ఆధునిక దర్శనం ఈ ప్రదర్శనం!

దీన్ని ఎవరు ఎప్పుడు ప్రారంభించారో
ఆ మానవతా మహర్షులకు అంజలి ఘటించు!
అటు "హుడా" కేసి పోదాం, పద!
స్వప్రయోజక భూస్వాము లెంత నిరోధిస్తున్నా,
నగరాభివృద్ధి శాఖ చేస్తున్న పని అనిరుద్ధం!
మురికి పేటల్ని నిర్మూలించి అది నిర్వహిస్తున్న
నాగరిక గృహ నిర్మాణ క్రియ నిహత సకర్మకం!

# 10. విద్యా మహా సరస్వతి

అటు పద, ఆ ఎగ్జిబిషను క్లబ్బు కేసి!
బేడ్జీ లేకుండా రానివ్వ రంటావా?
క్లబ్బు సభ్యులంతా మన మిత్రులే లే!
కళాకాంతుల జగన్మిత్రులు వాళ్ళు.

ఈ ప్రదర్శన ఏర్పాట్ల సమస్త విశ్వానికీ
కేవల బ్రహ్మకల్పులు!

వనితల కోసం వనితా మహా విద్యాలయాలు,
పాలిటెక్నిక్‌లు, విజ్ఞాన కళాశాలలు,
ఆధునిక విద్యా వికాస మందిరాలు,
ఒక్క భాగ్యనగరంలోనే కాదు–
రాజ్యం పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న
జ్ఞాన సరస్వతీ ప్రతిమూర్తులు!

ఇక్కడ మనం ఖర్చుచేసే ప్రతిపైసా
ఆ మహా సరస్వతి నొసట
ఒకో కస్తూరీ కుంకుమ తిలకం!
పుష్ప ప్రదర్శనలు, ఫల ప్రదర్శనలు,

పశు ప్రదర్శనలు, క్రీడా ప్రదర్శనలు,
సాంస్కృతిక ప్రదర్శనలు
కేవల ఆత్మోత్తేజకా లేనా?
యావత్ జాతికీ మార్గదర్శకాలు కావా?
ఈ ఎగ్జిబిషన్‌ను దర్శించడం
మనల్ని మనం గుర్తించడం!
భారత మహా మహత్ బ్రహ్మను
అణువులో పొదిగి ఆరాధించడం!

# 11. మానవ సౌందర్య మహార్ణవం

ఎన్నో అందాలు, చందాలు, అమృతాలు
ఆస్వాద్యాలు, అనుభవాలు, అభ్యుదయాలు!
ఈ సంతోష సౌందర్యాలన్నీ ఎందుకోసం?
నీ కోసమూ, నా కోసమూ!
నీ లాంటి నా లాంటి మనందరి కోసమూ!
ఎన్ని సౌందర్యాలైనా మానవ సౌందర్యాన్ని మించవు!
మానవ సౌందర్య మహార్ణవం ఈ ప్రదర్శనం!

ఎంత అందమైన, ఖరీదైన చీరైనా
దానిని కట్టుకొన్న కాంతను మించదు కదా?

క్లబ్బులో కొంచెం ఐసుక్రీం తిని
అక్కడ జరుగుతున్న కవితా గానం విని,

ఆ అటవీశాఖలో ఒక సీసా తేనె తీసుకొని,
ఆ మహిళా విభాగంలో పాపకు ఒక గౌను కొని,
మత్స్యశాఖ స్టాల్లో ఒక పార్శిలు చేపలు విలుచుకొని
పోదాం పద, అయిందప్పుడే పది!
తొమ్మిదికే మూసేసే రూలున్నా-

పన్నెండు దాటుతూనే వుంటుంది రోజూ!
రూల్సుకు కట్టుపడే ఫూల్సు
ఎంత మందీ నరమానవుల్లో?
ఆ సంగతులన్నీ మనకెందుకు కాని,
అలా చూడు పైకి!
స్వర్గంగా తీరంలో చల్లని పచ్చికబయళ్ళలో
గోమాతలు పిలుస్తున్నె కాదా, రాధా!

ఈ భూమ్యాకాశాల వెలుగు నీడల ఎగ్జిబిషన్లు
నీ అందచందాల చెక్కుటద్దాల రిఫ్లెక్షన్లు!

కొత్తదేం కాదు ఈ నిమాయిష్ తమాషా
నీలో నేను చూస్తున్నదే ఇది హమేషా!

ఇది మినీ జగత్తు,
మనీ అగరొత్తు!

అయినా, ఇది భాగ్యనగరం
భాగ్యమతీ భూషణాగారం!
త్రోవలో ప్రతి స్టాలునూ తొక్కి చూద్దాం,
ప్రతి అందాన్నీ అనుభవిస్తూ పోదాం!

* * *